క్లుప్తంగా

కనికలమ్మకు ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలోని కనికలమ్మ గ్రామదేవతకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన నిఖిల్‌వర్ధన్‌రెడ్డి


నిఖిల్‌వర్ధన్‌రెడ్డి

నగరి: టాప్ గ్లోబల్ యూనివర్సిటీల్లో ఇంజినీరింగ్ చదవడానికి నిర్వహించే ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా మేనల్లుడు, ఆమె పెద్ద సోదరుడైన కుమారస్వామిరెడ్డి కుమారుడు నిఖిల్‌వర్ధన్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. ప్రపంచ స్థాయి యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 94.2 స్కోర్ సాధించి 11వ స్థానంలో, ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 99.7 స్కోర్ సాధించి 2వ స్థానంలో నిలిచాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హాంకాంగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో మెరిట్ స్కాలర్‌షిప్‌తో సీటు సాధించాడు. యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ప్రతిభ కనబరిచిన నిఖిల్‌వర్ధన్‌రెడ్డికి మాజీ మంత్రి తదితరులు అభినందనలు తెలియజేశారు.

యువత సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా యువత, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని వైఎస్ఆర్ సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ తెలిపారు. వైఎస్ఆర్ సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత పోరును జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా నిరుద్యోగులకు నెలకు నిరుద్యోగభృతి కింద రూ.3 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. పరిశ్రమలను స్థాపించి స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ఏడాది ఒక్క సిలిండరే..


గ్యాస్ సిలిండర్లు

గుడిపాల: అధికారం కోసం కూటమి ప్రభుత్వం ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చింది. అందులో మహిళలను ప్రభావితం చేసింది ప్రతి ఏడాదికి మూడు సిలిండర్లు పథకం. కానీ ఇప్పుడు ఏడాదికి ఒకే ఒక్క సిలిండర్.. అదీ కొందరికి మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. 2024–25లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఉచిత గ్యాస్ పథకం కింద మూడు సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఒక్క సిలిండర్‌కు మాత్రమే నగదు జమ చేసిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టారని లబ్ధిదారులు వాపోతున్నారు. విద్యుత్‌బిల్లు ఎక్కువగా ఉందని, కొందరికి ఇంట్లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్త ఉన్నారని ఇలా అనేక కారణాలతో లబ్ధిదారులకు అందించాల్సిన ఉచిత రాయితీని ప్రభుత్వం ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో చంద్రబాబు హామీలన్నీ ఉత్తుత్తివేనన్న చర్చ మళ్లీ ప్రజల్లో మొదలైంది.

మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: మంగసముద్రం హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైకాలనీ, కింద కాలనీలకు పొట్టి శ్రీరాములు కాలనీగా నామకరణం చేయాలన్నారు. గత 42 ఏళ్లుగా ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేవన్నారు. ఇళ్ల పక్కనే మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. దుర్వాసన, దోమలతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని చెప్పారు. లెనిన్‌నగర్, హౌసింగ్ కాలనీల్లో పూర్తిగా మురుగు చేరిన ప్రాంతం అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. రోడ్లు లేకపోవడంతో వర్షపు నీరు ఒకచోట చేరి దోమల ఆవాసంగా మారిందని తెలిపారు. సమస్యలపై ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని నాయకులు మణి, రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, లతారెడ్డి, సుజాత, హేమలత, చిట్టిబాబు పాల్గొన్నారు.

సాకులతో అందని సాయం

ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అని చెప్పి చాలా మంది తల్లులకు కూటమి ప్రభుత్వం పంగనామం పెట్టింది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. ఆ హామీ మేరకు జూన్ 12న తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు జమ చేశారు. ప్రతి 10 మందిలో కేవలం ఐదారుగురికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

–పాలసముద్రం


తల్లికి వందనం రాలేదని సచివాలయంలో నమోదు చేస్తున్న తల్లిదండ్రులు

- కొందరు తల్లులకే తల్లికి వందనం
- చాలా మందికి దక్కని సాయం
- ఇదెక్కడి న్యాయమని తల్లిదండ్రులు ఆవేదన

సవాలక్ష షరతులు

కూటమి ప్రభుత్వం సాకుల పేరుతో తల్లికి వందనం డబ్బులు ఎగ్గొడుతోంది. తల్లుల ఖాతాల్లో నగదు జమ కావాలంటే సవాలక్ష షరతులు విధించారు. సాకుల పేరుతో అనర్హుల కింద లెక్కగట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.12 వేలు కంటే ఎక్కువ ఆధాయం ఉందని, కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయనే షరతులు విధించారు. సరైన ధ్రువీకరణ లేదని, ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని కొందరికి ఎగ్గొట్టారు. లేని భూమిని ఆన్‌లైన్‌లో చూపించి ఎక్కువ మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. రకరకాల సాకులు చూపించి తమను అనర్హుల జాబితాలో పెట్టి లబ్ధి దక్కకుండా చేశారని తల్లులు వాపోతున్నారు. అర్హుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ తమకు అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదని మరికొందరు తల్లులు పేర్కొంటున్నారు. పాఠశాల వద్దకు వెళ్లితే సచివాలయం వద్దకు వెళ్లండని, సచివాలయాల వద్దకు వెళ్లితే పాఠశాలల వద్దకు వెళ్లమని తిప్పుకుంటున్నారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యా శాఖాధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని వాపోతున్నారు.

అర్హులమా.. అనర్హులమా!



గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరిట నాకు డబ్బులు వేసింది. అయితే ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి సంబంధించి మా సచివాలయంలో అర్హుల, అనర్హుల జాబితాను ఉంచారు. మా అబ్బాయి పేరు జాబితాలో లేదు. అనర్హుల జాబితాలో లేదు. అనర్హుల జాబితాలో లేదు. దీనిపై అడిగితే ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు ఎవరూ పట్టించు కోవడం లేదు.

–మురళి, వనదుర్గాపురం, విద్యార్థి తండ్రి

అనర్హుల జాబితాలో చేర్చారు



నాకు నెలకు రూ.12 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉందని మా పేర్లు అనర్హుల జాబితాలో చేర్చారు. రూ.12 వేలు నెలకు ఆదాయం వస్తే తల్లికి వందనం డబ్బులు వేయరా? రూ.12 వేలు నెలసరి ఖర్చులకే సరిపోదు. తల్లికి వందనం పథకానికి అనర్హుల జాబితాలో చేర్చితే పిల్లల చదువుల ఫీజులు ఎలా చెల్లించాలి.

–నారాయణ, వీడీ పురం, ఆది ఆంధ్రవాడ

అధికారులు స్పందించడం లేదు



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందులో ఒకరికి మాత్రం తల్లికి వందనం డబ్బు పడింది. ఇంకొక అబ్బాయి మీరాఅబ్బాస్‌కి డబ్బులు పడలేదు. సచివాలయం, ఎంఈఓ కార్యాలయానికి వెళ్లి అడిగితే తమకేమీ సంబంధం లేదని, ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లమని చెప్పారు. ప్రభుత్వం ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికి తల్లికి వందనం డబ్బులు పడుతుందన్నారు. కానీ పడడం లేదు.

–మీరావలీబాషా, పాలసముద్రం, బీసీ కాలని

వాహనాల తనిఖీలు

నింద్ర: మండల కేంద్రంలో ఆదివారం నింద్ర పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పక ఉండాలని, వాహనాలకు సంబంధిత రికార్డులు తనిఖీలు చేశారు. పలువురు వాహనదారులకు సూచనలు ఇచ్చారు. అతి వేగంతో ప్రమాదాలకు గురికాకుండా వాహనాలు నడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొల్హాపురమ్మకు ఘనంగా పూజలు


కొల్హాపురమ్మ

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలోని కొల్హాపురమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామస్తులు అమ్మవారి గెరిగెను గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ మండల కమిటీల నియామకం

వెదురుకుప్పం: వైఎస్ఆర్ సీపీలో వివిధ విభాగాలకు సంబంధించి మండల కమిటీలను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆదివారం ప్రకటించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలను నియమించినట్లు తెలిపారు. మండల బీసీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా జి.గుణశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, త్యాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా ఢిల్లీ యాదవ్, సుబ్బయ్య, వెంకటేష్, జనార్ధన్, కార్యదర్శులుగా దాముఆచారి, ధనుంజయులు, గోవిందయ్య, దామోదర్‌రెడ్డి, హేమశేఖర్, మంగయ్య, మునిరాజు, ఎమాపతి, కార్యనిర్వాహక సభ్యులుగా చంద్రమోహన్, అశోక్, శేఖర్, వెంకటేష్, రమేస్, మార్కొండేయుడు, బాబు, జయచంద్రను నియమించినట్లు తెలిపారు.

క్రిస్టియన్ మైనారిటీ విభాగం

అధ్యక్షుడిగా ఈ.రాజేంద్రన్, ఉపాధ్యక్షులుగా పి.బాలసుబ్రమణ్యం, కె.ధనుంజయులు, ప్రధాన కార్యదర్శులుగా చిట్టిబాబు, స్టీఫెన్, సీహెచ్ ఆశీర్వాదం, కార్యదర్శులుగా వై.మోహన్, కె.చిన్నస్వామి, చిన్ని, వి.కాంతమ్మ, సీహెచ్ బాబు, కార్యవర్గ సభ్యులుగా సి.చంద్రయ్య, కె.భూపాలయ్య, కె.నాగజ్యోతి, కె.వెంకటేశ్, ఎ.ఏసయ్య, మోషే, ఎం.సునీల్‌కుమార్ నియమితులయ్యారు.

మహిళా విభాగం

మండల అధ్యక్షురాలిగా రాణెమ్మ, ఉపాధ్యక్షులుగా ఎస్.వనమ్మ, ఎస్.శ్యామల, ప్రధాన కార్యదర్శులుగా కె.భార్గవి, పి.రాజేశ్వరి, పి.సుగుణ, కార్యదర్శులుగా డి.సరిత, ఎం.కుట్టి, సీహెచ్ సునీత, జి.భాస్కరమ్మ, బి.ఇందిరమ్మ, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మమ్మ, జానకమ్మ, మైత్రి, టిల్లెమ్మ, విమల, చంద్రిక, గీత.

ముస్లిం మైనారిటీ విభాగం

అధ్యక్షుడిగా పి.మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులుగా కె.ఖాదర్ బాషా, డీజీ హుస్సేన్ సాహెబ్, ప్రధాన కార్యదర్శులుగా డీజీ గౌస్, ఎస్.అన్వర్‌బాషా, ఎ.దావూద్ బాషా, కార్యదర్శులుగా డి.సాహుల్, ఎస్.మస్తాన్, ఫరీద్, ఎస్.సుభాన్, నబియా, సభ్యులుగా రఫీ, మహ్మద్ అస్లామ్, మదర్‌సాహెబ్, సహీన, చాంద్‌బాషా, నజీర్, రాజాసాహెబ్.

పంచాయతీ రాజ్ విభాగం

మండల అధ్యక్షుడిగా బి.పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.పరమేశ్వర్‌రెడ్డి, మహేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.భాస్కర్ రెడ్డి, జి.రామణ్యంరెడ్డి, ఎన్.రామరాజు, కార్యదర్శులుగా కె.మణి, ఎం.పరంధామరెడ్డి, టి.రామకృష్ణారెడ్డి, వై.అరుణ, కె.చంద్రోశేఖర్, కార్యవర్గ సభ్యులుగా బి.భాస్కర్ రెడ్డి, ఎం.నాదమునిరెడ్డి, వాసుదేవన్, ఎస్.రాజేంద్రన్, కె.వెంకటేష్, బి.చెన్నకేశవులు రెడ్డి, వి.భయలదార నియమితులయ్యారు.

ప్రచార కమిటీ

అధ్యక్షుడిగా బి.రోశిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.గోవర్ధన్‌రెడ్డి, బి.చిరంజీవిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బి.వాసుదేవులు, బి.సుదర్శన్‌రెడ్డి, పి.చిన్నబ్బ, కార్యదర్శులుగా ఎస్.పరశురామయ్య, కె.వెంకటాద్రి, ఈ.యోగముని, జి.చంద్రబాబు, వి.రామమూర్తి, కార్యవర్గ సభ్యులుగా టి.సురేంద్ర, రూపశేఖర్‌రెడ్డి, అనురాధ, నవీన్‌కుమార్, కె.రత్నం, చిన్నబ్బ, పురుషోత్తంరెడ్డి నియమితులయ్యారు.

ఆర్టీఐ విభాగం

ఆర్టీఐ మండల అధ్యక్షుడిగా పూల అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్. రవికుమార్, ఎస్.రామరాజ్, ప్రధాన కార్యదర్శులుగా కె.కిషోర్ రెడ్డి, ఎన్.హేమశేఖర్, ఎన్.నవీన్‌కుమార్, కార్యదర్శులుగా వై.దిలీప్, ఎస్.లోకేష్, వి.మునిరాజ ఆచారి, కె.వెంకటేష్, కె.విజయభాస్కర్, కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాసులు, కె.ధనుంజయులు, ఎం.చెంగారెడ్డి, వి.రాజశేఖర్, వై.దుర్గాప్రసాద్, బి.వినోద్, పి.ముద్దుక్రిష్ణలను నియమించినట్లు తెలిపారు. కాగా మిగిలిన కమిటీలను సోమవారం ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఓం శక్తి అమ్మవారికి అంబళ్లు


అమ్మవారి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

పాలసముద్రం: మండలంలోని నిశ్శింకాపురం, తమిళనాడు సరిహద్దుల్లోని అమ్మవారికుప్పం గ్రామస్తులు కలసి ఆదివారం ఓం శక్తి అమ్మవారికి అంబలి ప్రసాదం చేసి వివిధ అభిషేకాలు పూజలు చేశారు. ఉదయం మహిళలు ఎరుపు రంగులు దుస్తులు ధరించి మధ్యాహ్నం ప్రతి ఒక్క మహిళ కొత్త మట్టి కుండలకు వేపాకు కట్టుకుని అందులో అంబలి పంబ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఒక్కరు తెచ్చిన అంబలిని పెద్ద పాత్రలో పోసి గర్భగుడిలోని ఓం శక్తి అమ్మవారిని ఆలయ అర్చకులు అంబలితో అభిషేకాలు చేశారు. సాయంత్రం మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.


పన్నూరులో వంగ తోట

కూరగాయల సాగుపై ఆసక్తి

విజయపురం: మండలంలోని రైతులు కూరగాయల సాగుపై అధిక ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా విజయపురం, మాధవరం, ఆలపాకం, కోసలనగరం, మహారాజపురం, నార్పరాజుకండ్రిగ, మల్లారెడ్డికండ్రిగ తదితర గ్రామాల్లో సుమారు 30 ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇక్కడ సాగు చేసిన కూరగాయలను తమిళనాడులోని తిరుత్తణి, కోయంబేడు మార్కెట్‌కు తరలించి మంచి ఆదాయం పొందుతున్నారు. ప్రతి రోజు కోయంబేడు మార్కెట్ నుంచి వాహనం వచ్చి రైతులు సాగు చేసిన కూరగాయలను కొనుగోలు చేయడంతో రైతులకు రవాణా ఖర్చు కూడా తగ్గుతోంది. అందుకే ఇక్కడ అధిక మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు.

అలరించిన దుర్యోధన వధ


బాలగంగనపల్లిలో దుర్యోధన వధ

గంగాధరనెల్లూరు: మండలంలోని బాలగంగనపల్లి గ్రామంలో ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం వైభవంగా జరిగింది. 18 రోజులుగా గ్రామస్తులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత మహోత్సవ కార్యక్రమంలో చివరి రోజైన దుర్యోధన వధ కార్యక్రమం అందరినీ అలరించింది. భీమ దుర్యోధన పాత్రల యుద్ధ సన్నివేశంలో పాత్ర దారులు కన్నులకు కట్టినట్టుగా నటించారు. ఆలయ ధర్మకర్త రవిరెడ్డి, ఉభయదారులుగా వేణుగోపాల్‌రెడ్డి, జానకిరామరెడ్డి వ్యవహరించారు. సోమశేఖర్ ఆచారి, దాము ఆచారి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హేమకుమార్ రాజు, వేణురెడ్డి, నీరజాక్షులురెడ్డి, సోమశేఖర్ ఆచారి పర్యవేక్షించారు.

పేరుకున్న పూడిక


పూడికతో నిండిన మురుగునీటి గుంత

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతం. ఇక్కడ కాలువలు నిర్మించకపోవడంతో 20 కుటుంబాల మురుగునీరు నివాసాల ముందు పెద్ద గుంటగా మారింది. సకాలంలో పూడికలు తీయకపోవడంతో గుంతలోని నీరు సంబంధిత ఇళ్లలోకి వెనక్కి వస్తోంది. దీనిపై గత 15 రోజులుగా సచివాలయం, మున్సిపల్ కార్యాలయాలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఎలాగూ కాలువను నిర్మించడం చేతకాలేదని, కనీసం పూడిక తీసి గుంతను లోతు చేస్తే సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభిస్తుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే దుర్వాసనభరితంగా మారిందని, విషజర్వాలు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

పూతలపట్టు(కాణిపాకం): మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వేము అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆ కళాశాలలో ఆదివారం సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం విద్యార్థులకు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ప్లాంటేషన్, బొటానికల్ సర్వే, బ్లడ్ గ్రూప్, బ్లడ్ లెవెల్ అనే అంశంపై అవగాహన కల్పించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజ సేవను అలవర్చుకోవాలని తెలిపారు. పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలన్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే మొక్కలు సమృద్ధిగా పెంచాలని చెప్పారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మెంబర్స్ సోనీ యాదవ్, మౌనిక, చందు ప్రియ, సౌజన్యతోపాటు ప్రిన్సిపల్ నవీన్, హెచ్‌ఓడీ నిరూపమా, గైడ్ శైలజ పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

పూతలపట్టు(యాదమరి): మండల పరిధిలోని పోటుకనుమ గ్రామంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం కనులపండువలా సాగింది. పాండవులు, ద్రౌపదీ అమ్మవారి మూల విరాట్లకు పండితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పరిణయోత్సవానికి ముస్తాబు చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల నడుమ వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేపట్టారు. చివరగా రాత్రి శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన వీధి నాటకం ఆకట్టుకుంది.

మామిడి రైతుల కోసం రేపు మహాధర్నా

యాదమరి: మామిడి పంటకు గిట్టుబాటు ధర అందించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వ తీరుపై అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేపు బంగారుపాళెం మార్కెట్ యార్డులో మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ సురేష్ బాబు తెలిపారు. ఈ మహా ధర్నా పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ మహాధర్నాకు రైతులు తరలిరావాలని కోరారు.

వరసిద్ధునికి విరాళాలు


విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అన్నదాన, గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం ఇద్దరు దాతలు నగదు విరాళం చేశారు. తిరుపతికి చెందిన మురుగన్ బోర్‌వెల్స్ బోస్ నాయుడు గోసంరక్షణకు రూ.ఒక లక్ష, నిత్య అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం ఇచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత సుశీల నిత్య అన్నదాన ట్రస్టుకు రూ.ఒక లక్ష విరాళంగా సమర్పించారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

రాలుతున్న మామిడి

- ఆరుగాలం శ్రమించి పండించిన పంట నేలపాలు
- రైతు సేవా కేంద్రాల్లోనే టోకెన్లు అందజేయాలంటున్న రైతులు


టోకెన్ల సమస్యపై మాట్లాడుతున్న సర్పంచ్



కిందపడి కుళ్లిపోతున్న మామిడి కాయలు, తోటలోనే రాలిన మామిడి కాయలు

నగరి: ఎంతో ఆశతో సాగుచేసిన మామిడి పంట ఈ ఏడాది రైతుకు నష్టాలే మిగుల్చుతోంది. మామిడి సీజన్ మొదలైనప్పటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఏ పరిశ్రమ వద్ద చూసినా తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు రైతుల సరకు తీసుకువచ్చి డ్రైవర్లు పడిగాపులు కాస్తున్నారు. టోకెన్ల కోసం తంటాలు పడుతున్నారు. తమిళనాడు నుంచి తక్కువ ధరకు అందించే రైతుల పోటీని తట్టుకోలేకపోతున్నారు. వెరసి ఎందుకు ఈ సాగును ఎంచుకున్నాం, ఎందుకు మామిడి తోటలు కౌలుకు తీసుకున్నాంరా దేవుడా... అంటూ మామిడి రైతు విలవిల్లాడి పోతున్నాడు. టోకెన్లు సమయానికి రాక కోత కోయకుండానే పంట తోటలోనే ఉంటూ రాలిపోతోంది. అక్కడే కుళ్లిపోతోంది. నియోజకవర్గంలో సుమారు 1400 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో అధిక శాతం తోతాపురి(బెంగళూరు) రకం మామిడినే సాగుచేశారు. ఈ ఏడాది ఈ రకానికి డిమాండ్ తగ్గింది. ప్రభుత్వం మద్దతు ప్రకటించామని చెబుతున్నా అది రైతులకు చేరడం లేదు. ప్రభుత్వ సూచనల మేరకు ఫ్యాక్టరీలు కేజీ రూ.4 చొప్పున కొనాల్సి ఉంది అయితే తమిళనాడు నుంచి కేజీ రూ.3కే అందిస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీలు తమిళనాడు రైతులకే ప్రాధాన్యత ఇస్తుండడంతో స్థానికంగా ఉన్న రైతులకు టోకెన్లు సమయానికి దొరక్క పండ్లు తోటలోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ఆర్‌ఎస్‌కేల వద్దే టోకెన్లు ఇవ్వండి

మామిడి రైతులను ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాయించి టోకన్లు అందజేస్తున్నారని. తమిళనాడు రైతులు తక్కువ ధరకు ఇస్తుండడంతో వారికి రెడ్‌కార్పెట్ వేస్తున్నారు. రైతులు పండించిన పంట ఏ ఫ్యాక్టరీకి పంపాలో టోకెన్లు రైతు సేవా కేంద్రంలోనే అందించాలని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు వ్యవసాయ అధికారి దృష్టికి కూడా తీసుకువచ్చారు. అలా చేస్తే మామిడి రైతుకు, ముందస్తు కిస్తీ ఇచ్చి కౌలుకు తోటలను తీసుకున్న రైతులకు కొంతైనా ఊరట కలుగుతుందని చెబుతున్నారు.